విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 13, అక్టోబర్ 2023

దళారుల దోపిడీ నుండి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర -రుద్రవరం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలుచేసి దళారుల దోపిడీ ముంచి రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుసంఘం సహాయ కార్యదర్శి రామచంద్రుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కోటకొండ, ఎల్లా వత్తుల, పెద్ద కంబలూరు, అప్పనపల్లె, కే.కొత్తూరు, శ్రీరంగాపురం, రుద్రవరం, నాగులవరం తదితర గ్రామాల్లో రైతులు పండించి కలాలలో ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు బుధవారం కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న గింజలు తడిసి పోవడంతో ఆయన రైతు సంఘం నాయకులతో కలిసి తడిసిన గింజలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనేందుకు ప్రభుత్వము కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రైతులు సాగుచేసిన మొక్కజొన్న సాగులో ఆశించినంత దిగుబడులు రాక సతమతమవుతున్నారన్నారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల లోపు మాత్రమే దిగుబడి వచ్చినది. రైతుకు అరకొరగా దిగుబడి వచ్చిందన్నారు.ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారస్తులు కల్లాల వద్దకు వచ్చి చింత కేవలం 1900 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వారం పది రోజుల తర్వాత డబ్బులు ఇస్తామంటున్నారు.రోజు బాగా ఎండ ఉన్నది అని రోడ్ల వెంట గింజలు ఆరబోస్తే బుధవారం ఒక్కసారిగా మేఘాలు విపరీతంగా వచ్చి కొంత మేర వర్షం కురిసి గింజలుతడుపుకునే పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు వర్షం వస్తుందో గింజలు తడిసిపోతాయో ఆందోళనలో రైతులు ఉన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వ అధికారులు రైతుల వద్దకు వచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంట కొనుగోలు చేస్తామని చెప్పడం లేదు. ఆర్‌బికే కేంద్రాల్లో పంట నమోదు చేసుకున్నా కూడా కొనుగోలు చేయుటకు వ్యవసాయ అధికారులు ఇప్పటివరకు రాలేదు. విత్తనం వేసేటప్పుడు నుండి పంట అమ్ముకునే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల వెంట రైతాంగం గింజల వద్ద కాపలా కాస్తుంటే కనీసం మేమున్నాము మీ గింజలు కొనుగోలు చేయిస్తాము అని చెప్పడానికి ముందుకు రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో మొక్కజొన్న కొనుగోలుకు క్వింటాలకు 1960 నుండి 2090 రూపాయలను మద్దతు ధరగా ప్రకటించినది. ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర జీవోలు ఉన్నాయి .కానీ వాటి అమలు మాత్రం జరగడం లేదు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, తక్షణమే రుద్రవరం మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మండలంలో ఉన్న రైతులందరి మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని, స్థానిక ఎమ్మెల్యే, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు జోక్యం చేసుకొని తాలూకాలోని రైతాంగ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని మద్దతుధరతో మొక్కజొన్నలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, మధ్య దళారుల దోపిడీ నుండి ఆళ్లగడ్డ తాలూకా రైతాంగాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని ప్రకటన ద్వారా కోరారు. మద్దతుధర అమలు కోసం రైతులందరూ ఐక్యంగాఉండి ప్రభుత్వం ద్వారా సాధించుకునేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మార్కెట్ మేనేజర్ దృష్టికి సమస్యను తీసుకెళుతున్నట్లు తెలిపారు. రైతులు తరలిరావాలని కోరారు.

వడ్ల వ్యాపారిపై కేసు నమోదు

విశాలాంధ్ర- బనగానపల్లె: ఆరుగాలం కష్టించి పండించిన వరి పంటను కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకపోవడంతో బీరవోలుకు చెందిన రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. వివరాల మేరకు నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీరవోలుకు చెందిన పార్సపు సుబ్బరాయుడు, ఆల మూరుకు చెందిన మల్లు జయప్రకాష్‌రెడ్డి ఇద్దరూ వడ్ల వ్యాపారంలో కమిషన్ ఏజెంట్లుగా ఉండి విజయవాడకు చెందిన లక్ష్మీ కిరణ్మై ట్రేడర్స్‌కు చెందిన యజమానులు లక్ష్మీ కిరణ్మై ఆమె భర్త సుబ్రహ్మణ్యం గుప్తాలు పరిచయమై మాకు వడ్లు పంపిస్తే మీకు నెలలోపు డబ్బులు ఇస్తామని చెప్పి 7 డిసెంబర్ 22 నుండి 23 డిసెంబరు 22 మధ్యలో బీరవోలు గ్రామానికి చెందిన కొంతమంది రైతుల దగ్గర 11 లారీల వడ్లను తీసుకొని వెళ్ళినారన్నారు. వాటివిలువ సుమారు రూ.68.09 లక్షలు కాగా, అందులో మాకు విడతలవారీగా రూ. 23.30 లక్షలు అకౌంట్లో డబ్బులు వేసినారని మిగిలిన డబ్బులు రూ. 44.79 లక్షలు వేయమని అడగ్గా వారు స్పందించడం లేదన్నారు. విజయవాడకు వెళ్లిఅడగ్గా వారు మాటలు చెప్పి కాలయాపన చేస్తున్నారని వ్యవసాయమే జీవనాధారంగా రైతులను మోసం చేసిన వారిపై బీరవోలు గ్రామానికి చెందిన పార్సపు సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు విజయవాడకు చెందిన లక్ష్మీ కిరణ్మై ట్రేడర్స్ కు చెందిన యజమానులైన లక్ష్మీ కిరణ్మై ,ఆమె భర్త సుబ్రహ్మణ్యం గుప్తాలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మల్లన్న హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర- శ్రీశైలం: ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు గత 28 రోజుల నుంచి భక్తులచే సమర్పించబడిన కానుకలను గురువారం లెక్కించడం జరిగింది ఈ లెక్కింపులో 3,17,50,290 రూపాయల నగదు 187 గ్రాముల300 మిల్లి గ్రాముల బంగారు6 కేజీల340 మిల్లి గ్రాముల వెండి వలు రకాల విదేశీ కరెన్సీ స్వామి అమ్మవార్లకు రాబడిగా లభించాయి ఈ హుండీ లెక్కింపు అంతా కూడా సీసీ కెమెరాల నిఘా సమక్షంలో జరపటం జరిగిందని కార్య నిర్వహణ అధికారి డి పెద్దిరాజు తెలిపాడు

పేదల ఆరోగ్య పరిరక్షణ కోసమే జగనన్న సురక్ష

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణం గాంధీ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. బొగ్గులైన్, రైతునగరం, క్రాంతినగర్, బొమ్మలసత్రం, ఊడుమలపురం, వెంకటేశ్వరపురం వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకమే జగనన్న సురక్షని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి పేదవానికి ఆరోగ్యరక్షగా ఉపయోగపడుతుందన్నారు. పట్టణం, గ్రామాల్లో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

విద్యార్థులకు సెలవుల్లో విజ్ఞానం పంచేందుకే ఏర్పాటు

విశాలాంధ్ర-కోవెలకుంట్ల: పాఠశాల విద్యార్థులకు ఈ నెల 14 నుండి 24 వరకు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతిరోజు విజ్ఞానకేంద్రం నిర్వహించ నున్నట్లు గ్రంథాలయాధికారి రాఘవరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు తమ విలువైన సమయాన్ని దసరాసెలవులలో స్ఫూర్తి నిలయమైన గ్రంథాలయంలోని పంచతంత్ర కథలు, దేశ నాయకులు, శాస్త్రవేత్తల ప్రముఖుల జీవితచరిత్రలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, పోటీపరీక్షలకు అవసరమైన అన్ని రకాల కాంపిటీషన్ పుస్తక ములు, సుమతి శతకము,వేమన శతకము మొదలగు విజ్ఞా నానికి సంబంధించిన పుస్తకములు గ్రంథాలయంలో అందు బాటులో ఉన్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, క్రొత్త పుంత లు తొక్కుతున్న కొద్ది సెల్‌ఫోన్ ప్రతిఒక్కరి జీవితంలో భాగమైందని అవసరం ఉన్న లేకపోయినా ఈ వస్తువు పూట గడవని పరిస్థితి విద్యార్థులు చిన్న వయసులో ఈ సెల్‌ఫోన్ చూడడం వలన కంటి సమస్యలు ఎక్కువయ్యాయని అన్నారు. ప్రస్తుతం గ్రంథాలయాల్లో అక్షర యజ్ఞాన్ని తలపిస్తున్నాయన్నారు.మంచి పుస్తకం చేతుల్లో ఉంటే వందమంది తోడుగా ఉన్న అనుభూతి కలుగుతుందని తల్లిదండ్రులు తమ స్వేదం చిందించి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు శ్రమిస్తారన్నారు. ఒక వయసుకు వచ్చిన తర్వాత దారి తెన్నులు తెలియని పరిస్థితుల్లో గ్రంథాలయ అక్షర దివిటీ వెలిగిస్తుందని తెలిపారు. అక్కడ నిశ్శబ్ద జీవితానికి వెలుగు బాట వేస్తుంది వేల సంఖ్యలలో పుస్తకాల్లోని ప్రతి పేజీ లక్ష్యాన్ని ఏర్పరచడంతో పాటు గెలుపు తీరాలను చేరుస్తుందన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు..

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ 20వ వార్డు కౌన్సిలర్ హుస్సేన్‌బాషా అన్నారు. మున్సిపల్ పరిధిలోని 10వ సచివాలయం 21వ అంగన్వాడి కేంద్రంలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు.

గజ్జల నోరు అదుపులో.. సింగం భరత్‌రెడ్డి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, నోటికి ఏది వచ్చినట్లు అది మాట్లాడితే ఊరుకునేది లేదని బిజెపి నాయకులు సింగం భరత్ రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ భూమా కిషోర్ రెడ్డి గ్రామస్థాయి నుండి తాలూకా స్థాయి వరకు ఆళ్లగడ్డలో బిజెపిని బలోపేతం చేయడం జరిగిందన్నారు. భూమా కుటుంబం తరఫున ఒక్కరే ప్రజల్లోకి వెళ్తున్నారని గ్రామాల్లో తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ఆయన చెప్పడం మీకు తప్పుగా అనిపించిందా అని సింగం ప్రశ్నించారు. గజ్జల రాఘవేంద్రారెడ్డి నీస్థాయి ఏమిటో అందరికి తెలుసన్నారు. నీవు మా నాయకుడు కిషోర్ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నావని ఆయన గురించి మాట్లాడే సరికి నీస్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడాలన్నారు. కరోనాలో ఇసుక మాఫియా చేసి నీవు తప్ప ఎవరు బాగుపడలేదని సింగం ఆరోపించారు. తిక్క తిక్కగా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. నీవు రెచ్చగొట్టే మాటలు మాట్లాడి ఆళ్లగడ్డను నీవు ఫ్యాక్షన్ దిశగా తీసుకెళ్లే లాగా చేస్తున్నావన్నారు. తన దగ్గర ఉన్న నాయకులు కార్యకర్తలు పద్ధతిగా మాట్లాడే విధంగా చూడాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.
అన్నెం ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ మా నాయకుడు భూమా కిషోర్ రెడ్డి వరకు ఎందుకని నీవు ఎంపీటీసీకి రాజీనామా చేస్తే నేనే నీకు పోటీకి సిద్ధమన్నారు. ఈసమావేశంలో నాగిరెడ్డిపల్లె శంకర్ రెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డి, హుస్సేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర -బనగానపల్లె: చంద్రబాబు అక్రమ అరెస్ట్ నిరసిస్తూ 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిశీలకులు బాజీ చౌదరి ఆధ్వర్యంలో ఓల్డ్ రైస్ మిల్ కాలనీ లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ బాబుకు అండగా నిలవాలంటూ ప్రచార కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాయలసీమ సలాం, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, వెల్కమ్ అల్తాఫ్, హాజీ, ఠాగూర్ పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి పట్టుదలతో చదవాలి

విశాలాంధ్ర - అవుకు : విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి కష్టపడి, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా 2023 జులై నెలలో నిర్వహించిన ఐటిఐ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ధ్రువపత్రాలను మండలాధ్యక్షుడు చల్లా రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు రామప్ప, ఐటిఐ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కోరుతూ పాదయాత్ర

విశాలాంధ్ర - బనగానపల్లె: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు, శుక్రవారం ఉదయం 7:30 గంటలకు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి యాగంటి దేవస్థానం వరకు బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.నియోజకవర్గంలోని యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయవలసినదిగా కోరారు.

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించండి

విశాలాంధ్ర- ఊపాడుబంగ్లా : జగనన్న భూ హక్కు రీసర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని తర్తూరులో నిర్వహిస్తున్న జగనన్న భుహక్కు రీ సర్వే పనులను వారు పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న భూ హక్కు రీ సర్వే ద్వారా రైతులకు దీర్ఘకాలిక భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. త్వరితగతిన రీ సర్వే పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.కార్యక్రమంలో సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే వైద్య సేవలు

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రజల వద్దకే ప్రభుత్వం వైద్య సేవలను అందిస్తున్నదని వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి అన్నారు. గురువారం బంధార్లపల్లిలో ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం అభివృద్ధితో పాటు ఆరోగ్యానికి అధిక ప్రాధన్యతను ఇస్తున్నదన్నారు. గ్రామీణ ప్రజల ముంగిటకే అన్ని సేవలు ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు.శిబిరంలో 431 మందికి వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

రోడ్లపై కనిపిస్తే గోశాలకు తరలింపు

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణ పరిధిలో వివిధ కూడళ్లలోరోడ్లపై ఆవులను వదలరాదని నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి, డిఎస్పి మహేశ్వర్ రెడ్డిలు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో గురువారం ఆవుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మహేశ్వర్ రెడ్డి, కమిషనర్ రవిచంద్రరెడ్డిలు మాట్లాడుతూ పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో, రోడ్లపై విచ్చలవిడిగా ఆవులను వదిలి వేయడం వల్ల కలిగే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, అలాగే స్పందనలో వచ్చిన ఫిర్యాదుల దృష్ట్యా ఆవులను తమ ఇళ్ల వద్దనే సంరక్షించుకోవాలని వారు యజమానులకు తెలిపారు. ఆదివారంలోపు ఆవులు రోడ్లపై ఉండరాదని, ఒకవేళ అలా కనిపిస్తే వెంటనే గోశాలకు తరలిస్తామని వారు పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా యజమానులు తప్పక తమ ఆవులను ఇళ్ల వద్దనే సంరక్షించుకోవాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ సూపర్వైజర్ లక్ష్మీనారాయణ, ఆవుల యజమానులు పాల్గొన్నారు.

సీపీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 3 వార్డు నందు రూ.20 లక్షల తో నిర్మించిన నూతన సిసి రోడ్లను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా,కౌన్సిలర్ సమ్మద్‌లు ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సిఎం జగన్ ప్రత్యేక నిధులను ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఓల్డ్‌టౌన్‌లో 3వ వార్డులో 20 లక్షలతో 2 నూతన సిసి రోడ్లను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించడం చాలా సంతోష కరమన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దారు నియామకం

విశాలాంధ్ర -బనగానపల్లె : బనగానపల్లె ఇన్‌చార్జ్ తాహసీల్దారుగా డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డిని జిల్లా అధికారులు నియమించడం జరిగింది. ఇక్కడ విధులు నిర్వహించిన తహసిల్దార్ వెంకటేశ్వర్లు అవుకు మండలానికి బదిలి కావడం జరిగింది. వెంకటేశ్వర్లు కేవలం 4 నెలలు మాత్రమే మండలానికి తహసీల్దార్‌గా సేవలందించారు. బనగానపల్లె మండలానికి మూడు నాలుగు సంవత్సరాలలో ఎంతోమంది తహసిల్దార్లు రావడం మూడు నాలుగు నెలలకే వేరే మండలాలకు బదిలీ అవుతున్నారు. మధ్యలో డిప్యూటీ తాహసిల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి ఇన్చార్జ్ తాహసిల్దారుగా నియమితులవుతూ వస్తున్నారు. జిల్లాలోనె బనగానపల్లె మండలం పెద్ద మండలం అవ్వడం అలాగే ఇద్దరు అరైలు గాను ఒకరు మరియు రెగ్యులర్ తహసిల్దార్ లేకపోవడంతో పరిపాలన కుంటుపడే ప్రమాదం ఉన్నది.

కందిలో వైయస్సార్ పొలంబడి

విశాలాంధ్ర -ఆత్మకూరు టౌన్ : మండలంలోని ఆత్మకూరు గ్రామంలో కందిపంటపై వైయస్సార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లావనరుల కేంద్ర వ్యవసాయ అధికారి హేమలత మాట్లాడుతూ పైరు విత్తిన 90-100 రోజులలో చిగుళ్ళను ఒక అడుగు మేరకు కత్తిరించాలి ఎకరాకు 5 లింగాకర్షిక బుట్టలు అమర్చి శనగపచ్చ పురుగు ఉనికిని గుర్తించవచ్చని అలాగే ఎకరాకు పది పక్షి సావరాలను ఏర్పాటు చేయాలన్నారు. పొలంలో పురుగులు ఉనికిని గుర్తించినప్పుడు వెంటనే వేప నూనె పిచికారి చేయాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ షేక్ బైరాపురం మహబూబ్ బాషా, కౌలు రైతు సంఘం అధ్యక్షులు తపాల అశ్రఫ్ అలీ, వ్యవసాయ సిబ్బంది, ఎంపీఈఓ రవి గౌడ్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పేరాయిపల్లె విద్యార్థులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని పేరాయిపల్లె జడ్పిహెచ్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహబూబ్ బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎస్పిజి గ్రౌండ్‌లో ఈనెల 9వ తేదీన జరిగిన యోగ జిల్లా సెలెక్షన్స్‌లో అండర్-14 విభాగంలో 8వ తరగతి చదువుతున్న భారతి మంచి ప్రతిభ కనబరిచిందన్నారు. బేస్‌బాల్‌లో అండర్-17 లో చరణ్ కుమార్, అండర్ -14 లో జశ్వంత్ మరియు అండర్ -17 కబడ్డీ పోటీలలో వినయ్ ఎంపిక అయ్యారన్నారు. ఈనెల 11వ తేదీన కర్నూల్ స్టేడియం నందు తైక్వాండో గేమ్ లో సుజాత, మహబూబ్ బి, డి.సమీరా ఎంపిక అయ్యారు. సాఫ్ట్ బాల్ నందు అండర్-14 లో కాశీవిశ్వనాథ్ ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు సీతారామయ్య , శేషసాయినారెడ్డి , కుమార్ మరియు వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, షాషావలి తదితరులు అభినందించారు.

మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక
ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య తెలిపారు. సిపిఐ కార్యాలయంలో రంజిత్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య మాట్లాడుతూ పట్టణంలో మునిసిపల్ కార్మికులు అనారోగ్యం పాలైనా పట్టణాన్ని శుభ్రంగా ఉంచుతూ ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా కాపాడుతూ ఉంటారని, అటువంటి వారి సమస్యలను ఈ ప్రభుత్వం పరిష్కరించలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు పాల్గొన్నారు. మున్సిపల్ పారిశుద్ధ కాంట్రాక్ట్ కార్మికుల నూతన కమిటీని అధ్యక్షులుగా రంజిత్, ఉపాధ్యక్షులుగా మంగమ్మ, చిన్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్, సహాయ కార్యదర్శులుగా లలితమ్మ, శివరాముడు, కోశాధికారిగా పెద్ద మద్దయ్యతో పాటు 21 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సొంత ఇంటితో గౌరవప్రదమైన జీవితం సమకూరింది

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సొంత ఇంటితో గౌరవప్రదమైన జీవితం సమకూరిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్లను పూర్తి చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కాకినాడ జిల్లా పెద్దాపురం, సామర్లకోట లో గృహోత్సవాల్లో వైయస్సార్ జగనన్న హౌసింగ్ కాలనీ లేఔట్ లను ప్రారంభించారు. అందులో భాగంగా ఓర్వకల్లు మండల కేంద్ర సమీపంలో వైయస్సార్ జగనన్న కాలనీ లే ఔట్లను జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్సీ మధుసూదన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్లు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరుగుతోందన్నారు. ఏదో ఇంటి స్థలం ఇచ్చామంటే ఇచ్చామని కాకుండా ఇంత విలువైన ప్రాంతంలో ఇచ్చి ఇళ్లు నిర్మించడంతో పాటుగా ప్రతిఇంటికి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 40 వేల ఇళ్లు మంజూరు కాగా అందులో 17 వేల ఇళ్ల నిర్మాణాలు విజయవంతంగా పూర్తి చేసుకున్నామన్నారు.మరో 20 వేల ఇళ్లు కూడా చివరి దశలో ఉన్నాయని, వాటిని నిర్మాణాలు కూడా త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నేషనల్ హైవే, ఇతర ప్రాజెక్టుల కోసం త్యాగాలు చేసిన రైతులకు ఎలాంటి నష్టం జరుగకుండా తగిన న్యాయం చేస్తామని కలెక్టర్ హామీనిచ్చారు.వైయస్సార్ జగనన్న కాలనీ లేఔట్‌లో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించి, సాయిపోగు పద్మావతి ఇంటిని ప్రారంభించారు.కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఓర్వకల్ తహసీల్దార్ శివరామిరెడ్డి, హౌసింగ్ ఈఈ నాగరాజు, ఎంపీడీవో శివ నాగప్రసాద్, ఇంఛార్జి సర్పంచ్ నాగేశ్వరమ్మ, జెడ్పిటిసి రంగనాథ్ గౌడ్, ఎంపిపి తిప్పన, ఎంపీటీసీ షాకిరున్నీసా, వైస్ ఎంపిపి పద్మనాభ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ లు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ఇళ్లు లేని పేద ప్రజలందరికీ ఉచితంగా ఇళ్లు నిర్మించి అందిస్తానని మాట ఇచ్చినప్రకారమే ఇళ్ల పట్టాలిచ్చి, అందులో గృహనిర్మాణాలు చేపట్టి లబ్ధిదారులకు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని నేలంపాడు, రాంపల్లి, పెద్ద భోదనం గ్రామాలలోని, రూ2.57 కోట్లతో నిర్మించిన సచివాలయము, ఆయుష్మాన్ భవనం, రైతు భరోసా కేంద్రం సీసీ రోడ్లు, 40వ జాతీయ రహదారి నుండి, తారు రోడ్డుకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గురువారం ప్రారంభించారు. నేలంపాడుకు ఎమ్మెల్యే చేరుకోగానే సర్పంచ్ ప్రతాపరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి గుండు సాహెబ్‌బాషా, నాగేశ్వరరావు, ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ గ్రామం భూమా వర్గం మద్దతుగా కొనసాగేది, అప్పట్లో, ఇన్ని కోట్ల రూపాయల అభివృద్ధితో జరగకపోవడం విశేషం. అభివృద్ధిలో మరో మెట్టు మనం ముందుకేసి ఏఎంసీ నిధులతో 40వజాతీయ రహదారి నుండి నేలంపాడు వరకు తారు రోడ్డు వేయడం జరిగిందన్నారు.

దూదేకుల నూరు భాషాలను బీసీ ఈ లో చేర్చాలి

విశాలాంధ్ర-మిడుతూరు : గత 70 ఏళ్లుగా దూదేకుల నూరు బాషాల జీవన విధానంలో ఎటువంటి మార్పు లేదని, ఎన్నో ప్రభుత్వాలు మారుతున్న మాజాతి తలరాతలు మాత్రం మారడం లేదని దూదేకుల నూరు భాషాలను బీసీ- ఈ లో చేర్చాలని నియోజవర్గ దూదేకుల హక్కుల పోరాట సమితి నాయకులు దూదేకుల భాజావలి పేర్కొన్నారు. గురువారం దూదేకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వంలో అపరిశుభ్ర కులవృత్తుల వారందరినీ ఎస్సీల్లో చేర్చడం జరిగిందని అందులో దూదేకులను కూడాఎస్సీలుగా చేర్చారన్నారు. లేనిపక్షంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి దూదేకుల నూరు బాషాల సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. హుస్సేన్ సాహెబ్, ముర్తుజావలి, మాభాష, చాంద్‌భాష,మౌలాలి, మన్సూర్, షేక్షావలి, ఉల్లిగడ్డల ముత్తులు పాల్గొన్నారు.

OFFICE OF THE BETHAMCHERLA NGARAPANCHAYAT
e-Procurement Tender Notice

The Municipal Commissioner, Bethamcherla Nagarapanchayat, Nandyal Dist., Andhra Pradesh State., inviting Tenders vide, Tender Notice No.
Roc.No., 375/Additional Funds(Special grants)&GGMP/2022-23/2024-E1, Dated. 12-10-2023 in Bethamcherla Nagarapanchayat.

1. Total No. of works	: 5 work under Special Grant 2022-23. 2 Works under GGMP 2023-24.
2. Total value of works	: 144.6 Lakhs under Special Grant 2022-23. 20 Lakhs Under GGMP 2023--24
3. Name of Works	: Laying of CC Roads,and CC Drain in Various Places in Bethemcherla NP
The First call Bid can Download on AP e-Procurement portal from 13-10-2023 to	: 27-10-2023 (15.30 Hrs)
Due date for submission of bid	: 27-10-2023 @ (16:00Hrs).
Bid Opening Date	: 27-10-2023 @ (16:30 Hrs).

Please visit **Www.apeprocurement.gov.in** portal for further details.
Name & address of the officers to Contact :
Municipal Commissioner: 9110520903.
Municipal Engineer : 9490210543.

Municipal Commissioner,
ABethamcherla Nagarapanchayat

Pay water charges & property tax and D&O trade license fees, encroachment fees and cooperate in the Developmental Activities in Bethamcherla Nagarapanchayat.

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com కర్నూలు, శుక్రవారం 13, అక్టోబర్ 2023

ఏపీ మహిళా సమాఖ్యలోకి భారీగా మహిళల చేరిక

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘమైన మహిళా సమాఖ్యలో 100 మంది బీడీ కార్మికుల కాలనీ మహిళలు గురువారం చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ సీనియర్ నాయకులుకే.జగన్నాథం, సీపీఐ నగరకార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు బీసన్న, నగరకౌన్సిల్ సభ్యులు చంటి, మౌలాలి,లక్ష్మీదేవిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ సీపీఐ దాని అనుబంధ సంఘమైన మహిళా సమాఖ్య గత కొన్నేళ్లుగా మహిళా హక్కుల కోసం పోరాటాలు చేస్తోందన్నారు. అలాగే వారిపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఏపీ మహిళా సమైక్య అనేక పోరాటాలు చేస్తోందనీ, బీడీకార్మికుల కాలనీలోని మహిళలు ఎదుర్కొన్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీగా మహిళా సమైక్యగా మీ పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. కమ్యూనిస్టు పార్టీ చేసే పోరాటాలలో మీరు కూడా భాగస్వాములు కావాలని వారికి పిలుపునిచ్చారు.

మహిళా సమైక్య నూతన కమిటీ

శ్రీగిరి లక్ష్మి, రామేశ్వరి, హేమలత, జయమ్మ, భాగ్యలక్ష్మి, సరిత, పద్మ, రేణుక, ప్రమీల, సత్యంలతో పాటు మరి కొంత మంది మహిళలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సమావేశానికి సర్పంచుల డుమ్మా

సర్పంచులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

మండల సర్వసభ్య సమా వేశానికి ముగ్గురు సర్పంచుల మినహా మిగిలిన గ్రామాల సర్పంచులు గైర్హాజరయ్యారు. దీంతో సమావేశం గంటకు పైగా ఆలస్యంగా ప్రారంభమైంది. గ్రామాల్లో సమస్యలు చర్చించాల్సిన సర్పంచులే గైర్హాజరైతే అధికారులకు సమస్యలు ఎలా తెలుస్తాయనీ పలువురు చర్చింకోవడం కొసమెరుపు. ఏదేమైనప్పటికీ ప్రభుత్వం సర్పంచులు వాడుకోవడమే ఇందుకు ప్రధాన కారణమని సమాచారం.

విశాలాంధ్ర- కర్నూలు జడ్పీ : నగరంలోని జిల్లా పరిషత్ లోని కర్నూలు మండల కార్యాలయంలో గురువారం మండల అధ్యక్షురాలు డి.వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో అజంఖాన్ లు నిర్వహించారు. ఈసమావేశానికి ముగ్గురు సర్పంచులు మినహా మిగిలిన వారు గైర్హాజయ్యారు. దీంతో సమావేశం ఆలస్యంగా 12 గంటలకు మొదలైంది. గంటలోపే సమావేశం ముగించి మమ అనిపించారు. అసలే వర్షాలు సక్రమంగా కురవ, మండలంలోని చాలా గ్రామాల్లో తీవ్ర స్థాయిలో సాగు, తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ సమస్యలు కాస్త అటకెక్కినట్లైంది.ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు సభకు నివేదించారు.

ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -ఆదోని రూరల్ : పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులతో ఎస్టీయూ సభ్యత్వ నమోదు ప్రక్రియ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర పురపాలక కమిటీ సభ్యులు రమేష్ నాయుడు,ఎస్టీయూ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వీర చంద్ర యాదవ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మునిసిపల్ ఉపాధ్యాయులు నూతన సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం చేయాలని, మునిసిపల్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్, అర్బన్ విద్యాధికారి,డిప్యూటీ డీఈఓ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.మునిసిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలని,కొన్ని మున్సిపాలిటీలలో పెండింగులో ఉన్న అరియర్స్ బిల్లులు కోసం కొత్త హెడ్ ఆఫ్ అకౌంట్ క్రియట్ చేయాలన్నారు.మునిసిపల్ ఉపాధ్యాయులకు జీపిఎఫ్ సౌకర్యం ప్రారంభించాలన్నారు.ఇంకా చాలా మున్సిపాలిటీలో 84 జీఓ వచ్చి స్కూల్ ఎడ్యుకేషన్ లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయులు జీతాలు రాలేదని వెంటనే సమస్య పరిష్కరించి జీతాలు చెల్లించాలని కోరారు. మునిసిపల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఈకార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గురుస్వామి, శ్రీనివాసులు, భీమరాజు, భాస్కర్ ఆచారి,చంద్ర శేఖర్ జయరాం,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఝాన్సీ

విశాలాంధ్ర - కల్లూరు: ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎం.ఝాన్సీ ఎంపికైనట్లు మనిసాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం కర్నూలు నగరంలో యునైటెడ్ ప్రైవేట్ స్కూల్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మనిసాయి ఇంగ్లీష్ మీడియం స్కూలు ఉపాధ్యాయురాలు ఝాన్సీ ఉత్తమ ఉపాధ్యాయురాలు గా ఎంపికై ఆమెను నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన మేధావులు పెద్దలు అత్యంత ఘనంగా సన్మానించడం జరిగిందని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అహర్నిశలు కృషిచేసి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో ఝాన్సీ మేడం ముందుంటుందని ఆమెచేసిన సేవలే నేడు ఉత్తమ ప్రతిభకు ఎంపిక చేశాయని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రైవేట్‌స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జి పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో...

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: స్వయం ప్రతిపత్తి కల్గిన జి.పులయ్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జంకేర్ కామినేని హాస్పిటల్ ఆర్థరైటిస్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ ఆర్థరైటిస్ డే నీ పురస్కరించుకొని డాక్టర్. జీవీఎస్ రవిబాబు, సీనియర్ కన్సల్టెంట్ జాయింట్ రీ కన్స్ట్రక్టివ్, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ ఈ వైద్య శిబిరాన్ని కళాశాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలల లోని బోధన, బోధనేతర సిబ్బందికి బీపీ, షుగర్, ఆర్థోపెడిక్ కన్సల్టెన్సీ, ఫిజియోథెరపీ కన్సల్టెన్సీ సేవలను ఉచితంగా అందించారు. కళాశాల స్పెషల్ ఆఫీసర్ వై పాండురంగయ్య మాట్లాడుతూ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ సి. శ్రీనివాసరావు విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి. శశి కుమార్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెరుగుదల

విశాలాంధ్ర- హెరాలగుంద: మండల కేంద్రమైన హెలగుంద సచివాలయం పక్కన 4 ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నామని ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథ్ గురువారం తెలిపారు. రెండు ఇంకుడు గుంతలు 1,20,000 కాగా మిగిలిన రెండు ఇంకుడు గుంతలు 1,60,000 అని అన్నారు. 42 మంది సరిపడా కూలీలకు రూ.272ల ప్రకారం 6 రోజుల్లో ఇంకుడు గుంతతవ్వాల్సి ఉందన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలం పెరుగుతుందని,తద్వారా బోరు బావుల్లో మంచినీటి సరఫరా సంతృప్తి కరంగా అందుతుందన్నారు. వర్షంనీరు వృధా కాకుండా ఉండడానికి ఇంకుడు గుంత నిర్మిస్తున్నామని తెలిపారు. ఇంకుడు గుంతనిర్మాణంతో కూలీలకు ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. మండలంలో ఫారం ఫండ్స్ నిర్మించామన్నారు. రైతులకు ప్రజలకు అనేక ఉపయోగాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఫారం ఫండ్ నిర్మాణంతో ఆకుకూరలు, తోటల పెంపకం కోసం వర్షం నీరు అనేక విధాలుగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

జనవరి వరకు సాగు నీరు అందించాల్సిందే

సీపీఐ ఆధ్వర్యంలోఎల్లెల్సీ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర -ఎమ్మిగనూరు: ఎల్లెల్సీ, హెచ్చెల్సీల పరిధిలో సాగు చేస్తున్న ఆనకట్ట రైతులకు జనవరి చివరి వరకు నీళ్లు వదిలి పంటలు కాపాడాలని కోరుతూ సీపీఐ,ఏపీరైతుసంఘం (ఏఐకెఎస్) ఆధ్వర్యంలో గురువారం ఎల్లెల్సీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంపన్నగౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న, సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు, తుంగభద్ర జలాశయం, కాలువ కింద గల ఆయకట్టు భూములకు నీటిని నవంబర్ 10 వరకు వరకు సరఫరా చేస్తామని తుంగభద్ర జలాశయ బోర్డ్ నిర్ణయించడంతో, కింద పంటలు సాగు చేసిన ఆయకట్టు రైతుల్లో తీవ్రఆందోళన మొదలైందన్నారు.ఈఏడాది నీరు ఆలస్యంగా రావడంతో రైతులు వరి, మిర్చి, ఉల్లి, పత్తి, పంటలు ఆలస్యంగా వేయడం జరిగిందని, జనవరి ఆఖరి వరకు నీరు విడుదల చేస్తేతప్పా పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదన్నారు. తుంగభద్ర జలాశయ అధికారులు ఎలాంటి ఆలోచన చేయకుండా రైతుల నష్టపోకుండా పంటలు చేతికొచ్చే విధంగా జనవరి ఆఖరివరకు ఎల్లెల్సీ, హెచ్చెల్సీ, ఆయకట్టు రైతులకు నీరు సరఫరా చేసి రైతుల పంటలు కాపాడాలని వారు కోరారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో తీవ్ర వర్షాభావం కారణంగా కరువు విలయతాండం చేస్తుందని, రైతులు ఇప్పటికే చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, అరకొరగా ఉన్న ఎల్ఎల్సీ పరివాహక ప్రాంతంలో అయినా పంటలు పండించుకుందామంటే పంటల మధ్యలో ఉన్నప్పుడే నీళ్లు నిలిపి వేస్తామనడం గోరు చుట్టుపై రోకలి పూట అన్న చందంగా మారిందన్నారు.కర్నూలు జిల్లా మంత్రి, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి తుంగభద్ర బోర్డు అధికారులతో మాట్లాడి రైతుల పంటలకు నష్టం జరగకుండా జనవరి ఆఖరి వరకు నీళ్లు వదిలే విధంగా కృషి చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున రైతులను కలుపుకుని ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి.టి.చిన్నన్న, కేసీ.జబ్బర్, ఖాజా, మల్లికార్జునగౌడ్, విజయేంద్ర, వీరేష్, తిమ్మగురుడు, నరసింహులు, శంకర్, రంగస్వామి, ఆంజనేయ, రాము, సుంకన్న, ఇస్మాయిల్, మునుస్వామి, మల్లికార్జున, నరసింహులు, సీపీఐ, రైతు సంఘం నాయకులు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీ.. వీసీ రిజిస్ట్రార్ల దిష్టిబొమ్మ దగ్ధం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు గురువారం క్లస్టర్ వర్సిటీ అవినీతి అక్రమాలపై ధర్నా నిర్వహించి వీసీ, రిజిస్ట్రార్‌ల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి, జి.మునిస్వామి, ఏఐవైఎఫ్ నగరకార్యదర్శి, ఎం.బీసన్నలు అధ్యక్షత వహించారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనకబడిన తరగతుల అభివృద్ధి కొరకు ఏర్పడినటువంటి క్లస్టర్ వర్సిటీ అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు ఉల్లంఘించి తమకు ఇష్టానుసారంగా వర్సిటీ పరిధిలో ఉన్న కళాశాల విద్యార్థుల నుండి కోర్సు ఫీజుల పేరిట ఒక్కో విద్యార్థి నుండి రూ.6 వేల నుండి 9 వేల వరకు వసూలు చేయడం జరిగిందని ఆరోపించారు. అలాగే కేవిఆర్ కళాశాల 2021 సంవత్సర పీజీ విద్యార్థుల పరీక్ష ఫలితాలు నేటికి విడుదల చేయకపోవడం సిగ్గుచేటని, ఈ ఫలితాలు విడుదల చేయకపోవడానికి గల ఆంతర్యమేంటని ప్రశ్నించారు. జెవిడి అర్హత పొందిన విద్యార్థుల నుండి ఎలాంటి ఫీజు రుసుం కట్టించుకోరాదని అలాట్మెంట్ కాపీలో ఉన్నప్పటికీ, క్లస్టర్ వర్సిటీ వి.సి,రిజిస్ట్రార్లు మాత్రం తమ ఇష్టానుసారంగా ఎలాంటి ఫీజు రసీదు లేకుండానే విద్యార్థుల నుండి ఫీజులు కట్టించుకున్నారు.నేడు క్లస్టర్ యూనివర్సిటీలో రిజిస్టర్ అయినటువంటి శ్రీనివాస్ డిప్యూటేషన్ మీద ఇక్కడికి రావడం జరిగింది. డిప్టేషన్ రద్దు అయి 2 నెలలు గడుస్తున్నప్పటికీ ఉన్నత విద్య మండలి నుంచి మీరు వెళ్లిపోండని ఉత్తర్వులు జారీ అయింది. శ్రీ వెంకటేశ్వర వర్సిటీ నుండి మీరు తిరిగి రండని పిలుస్తున్నా తన కుర్చీకి ఫెవికాల్ వేసుకుని ఇక్కడే ఎందుకు కూర్చున్నారు. దీనిపైన వి.సి. ఎందుకు నోరు మెదవడం లేదన్నారు. వి.సి.కి రిజిస్ట్రార్‌ని ఇక్కడే ఉంచుకోవడంలో రహస్యం ఏంటని ప్రశ్నించారు. తక్షణ మే విద్యార్థుల నుంచి వసూలు చేసిన కోర్సు ఫీజులు తక్షణమే తిరిగి చెల్లించాలనీ, పీజీ విద్యార్థుల పరీక్ష ఫలితాలు వెంటనే విడుదల చేసి, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌ను తక్షణమే వీధుల్లో నుంచి తొలగించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వర్సిటీ పరిధిలోని కళాశాల విద్యార్థుల్ని కలుపుకొని పెద్దఎత్తున వర్సిటీ ముట్టడి కార్యక్రమానికి కూడా శ్రీకారం చుడతామని ఈసందర్భంగా వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్, ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి అశోక్, నాయకులు రవి, శివరాజు రాజశేఖర్, విష్ణు,నాగరామ్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బాబయ్య, నాయకులుచంటి, సురేంద్ర, కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలి



విశాలాంధ్ర : కోడుమూరు : మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు ప్రజా సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించి,అధికారుల సమన్వయంతో గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పిటిసి బి రఘునాథరెడ్డి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంపీపీ రూతమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా జడ్పిటిసి రఘునాథరెడ్డి హాజరయ్యారు. సమావేశంలో ముందుగా వివిధ శాఖల మండల స్థాయి అధికారులు వారి శాఖల యొక్క సమగ్ర నివేదికలను చదివి వినిపించారు.జడ్పిటిసి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అందరూ అధికారుల సమన్వయంతో ప్రజలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని అందించేలా కృషి చేయాలన్నారు. అంతకు ముందు అధికారుల నివేదికల సందర్భంగా ఎక్సైజ్ శాఖ అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల ఎంపీటీసీ సందప్ప అసహనం వ్యక్తం చేస్తూ రెండేళ్లుగా జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశానికి ఎక్సైజ్ శాఖ అధికారులు హాజరు కావడం లేదని ఆరోపించారు.గ్రామాల్లో బెల్ట్ షాపుల తీవ్రత ఎక్కువగా ఉందని, వాటి వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని, నెలనెలా మామ్ములకు వారు అలవాటు పడినట్టుగా ఉందనీ మండిపడ్డారు. ఈ విషయంపై స్పందించిన ఎంపీడీవో చంద్రశేఖర్ ఎక్సైజ్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తామన్నారు. ఈసమావేశంలో ఉపాధిహామీ ఏపీఓ మోదీన్‌భాష, విద్యుత్‌శాఖ ఏఈ ఇస్మాయిల్, ఎంఈఓ, ఏపీఎం పుష్పావతి, ఏవో రవిప్రకాష్, ఈవో అజయ్ భాస్కర్, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు,ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లార్తి ఉరుసు మహోత్సవం

విశాలాంధ్ర -హెరాళగుంద : మండలంలోని ఎల్లార్తి షేక్ షావలి -షాశావలి 361 ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి .స్వామివారి గ్రంధాన్ని మాజీ దర్గా ముజావర్ అబ్దుల్ రవుఫ్ ఇంటి నుండి మేల తాళాలు తాసి రందొల్ వాయిస్తూ ఫకీర్ సాము ల విన్యాసాలతో దర్గా వంశీకుడు నూరు బాబా పురవీధుల గుండా ఊరేగిస్తూ దర్గా వరకు తీసుకువచ్చి ప్రత్యేక ఫాతిహాలు చదివించారు. ఉరుసు ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని శిక్షావలి షాషావలి దూద్ పిరా జండా కట్ట దాదా దాది మా దర్గాలలో ప్రత్యేక ఫాతిహాలు చదివించారు. భక్తులకు సర్పంచ్ కురువ చాముండేశ్వరీ వైకాపా యువ నాయకులు దరగప్ప ,ఎస్కే గిరి ఆధ్వర్యంలో తాగునీరు విద్యుత్ వైద్య సదుపాయం పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టారు.

దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర - ఆదోని : గత 32 ఏళ్లుగా సమస్యత్మకంగా ఉన్న ఆదోని మండలం మండగిరి గ్రామపంచాయతీ 352 సర్వేనెంబర్ ప్లాట్ల సమస్యను ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పరిష్కార మార్గం చూపి 421 మందికి న్యాయం చేస్తే నిందలు వేయడం ఏంటని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని వైకాపా సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి , రామకృష్ణారెడ్డిలు అన్నారు. గురువారం 352 సర్వేనెంబర్ ప్లాట్ లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 32 ఏళ్లుగా 352 సర్వేనెంబర్ వివరాలను కొనుగోలు చేసిన పత్రాలను దశ,దశాలుగా జరిగిన అక్రమాలు బినామీ రిజిస్ట్రేషన్లు , ఒక్కొక్క ప్లాటును పలుమార్లు అమ్మినవివరాలను వెల్లడించారు. ముఖ్యంగా అసలు 352 సర్వే నెంబర్లు హక్కుదారుల నుండి కొనుగోలు చేయకుండానే దత్తాత్రేయ అనే వ్యక్తి వచ్చి తాను కూడా స్థలాన్ని కొనుగోలు చేశానని తనకు న్యాయం చేయకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని బెదిరించాడని, దీనిపై విచారిస్తే నకిలీ మనిషితో రిజిస్టర్ చేయించుకుని బెదిరిస్తున్నాడని అతనిపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. 352 సర్వేనెంబర్‌లో హమీద్ అనే వ్యక్తి చంద్రమ్మ అనే మహిళా ద్వారా రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి ప్లాట్ వేసి 1991లో 73 మందికి విక్రయించాడన్నారు. అంతేకాకుండా మొదట 73 మందికి ప్లాట్లు విక్రయించిన హమీద్ అనే వ్యక్తి మరో మారు మరో 80 మందికి ప్లాట్లు అమ్ముకుని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. మరోపక్క ఆబిద్ అనే వ్యక్తి 4.24 ఎకరాలను చంద్రమ్మ ద్వారా అగ్రిమెంట్ చేయించుకుని 187 మందికి ప్లాట్లు విక్రయించాడన్నారు. అలాగే 2016లో హర్ష అనే వ్యక్తి ఇదే భూమిపై నాన్ అగ్రికల్చర్ చేయించుకుని మరల ప్లాట్లు వేసి అమ్ముకున్నాడని, మరల 2019లో ఎరుకల సూరి అనే వ్యక్తి హమీద్ నుండి 60 సెంట్ల భూమిని కొనుగోలు చేసి ప్లాట్లు అమ్ముకున్నారని వివరించారు. ఈవిధంగా నాలుగెకరాల్లో 421 మంది బాధితులు డబ్బులు కట్టి ప్లాట్లు తీసుకొని నష్టపోయారని, వీరందరూ తమకు న్యాయం చేయాలని 2019లో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ని ఆశ్రయిస్తే ఆయన ఎన్నికల అనంతరం ఈ సమస్యను సిసిఎల్ఏ దృష్టికి తీసుకెళ్లి పూర్తి వివరాలను తెచ్చి బాధితులు అందరికీ న్యాయం చేసే విధంగా ఒక్కొక్క ప్లాటును రూ. 1.60 లక్షలు చెల్లించే విధంగా ఒప్పందం కుదిరిచ్చి తమ ద్వారా చెల్లించారన్నారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆలస్యం కావడం వల్ల డబ్బులు చెల్లించడం ఆలస్యం అయిందని, అంతేతప్ప తాము ఎవరికి కూడా డబ్బులు ఇవ్వకుండా అన్యాయం చేయలేదన్నారు. ముఖ్యంగా గత రెండు రోజుల క్రితం వచ్చిన దత్తాత్రేయ అనే వ్యక్తి 2015 హమీద్ అనే పేరు ఉన్న వ్యక్తిని అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేకు కుంట గ్రామం నుంచి తీసుకువచ్చి అదే రోజు ఆధార్ కార్డు నమోదు చేయించి, ఆధార్ కార్డు ఎన్ఐఏ కాపీ ద్వారా ఆదోనిలో కాకుండా ఎమ్మిగనూరులో సర్వే నెంబర్ 352 భూమిలో 50 సెంట్లు స్థలాన్ని రిజిస్టర్ చేయించుకున్నారని, పూర్తిగా తాము పరిశీలిస్తే వెలుగులోకి వచ్చిందన్నారు. కేవలం కుట్రపూరితంగానే దత్తాత్రేయ అనే వ్యక్తిని ఈ సర్వే నంబర్లలోకి తెచ్చారని ఇది మొత్తం మోసమని దీనిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఒక్క ఫ్లాట్ ను ఇద్దరి నుంచి ముగ్గురు వరకు కొనుగోలు చేసిన బాధితులకు వారు కొనుగోలు చేసిన ధరలపై 82 నుంచి 85 శాతం దాకా ధర కట్టించి న్యాయం చేయడం జరిగిందని ఇందులో ఎవరికి అన్యాయం జరగలేదని అనవసరంగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పై ఎమ్మెల్యే తనయుడు జయ మనోజ్ రెడ్డి పై ఆరోపణలు చేయడం మానుకోవాలని వాస్తవాలు తెలుసుకోవాలని వారు కోరారు. అసలు సంబంధం లేని ఒక వ్యక్తి వచ్చి తనకు న్యాయం చేయాలని ఆత్మహత్యాయత్నం పాల్పడితే ఆ సమస్యను వైసీపీకు ఆపార్టీ పై, నాయకులపై నిందించడం తగదని వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని భూములను కబ్జా చేసే అవసరం ఎమ్మెల్యేకు పార్టీ నాయకులకు లేదని స్పష్టం చేశారు. 352 సర్వేనెంబర్ భూమిలో ప్లాట్లు వేసి అమ్మకాలు చేసిన అసలైన వ్యక్తి హమీద్ మాట్లాడుతూ తాను దత్తాత్రేయ అనే వ్యక్తికి ఎలాంటి భూమిని అమ్మలేదని తన అవసరాల నిమిత్తం డబల్ రిజిస్ట్రేషన్ చేయించానని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని టిడిపి నాయకురాలు కృష్ణమ్మ విమర్శలు చేయడం మానుకోవాలని వాస్తవాలు తెలుసుకోవాలని నోరు ఉంది మీడియా ఉంది అని నోటికి వచ్చినట్లు మాట్లాడడం తగదని వెంకటేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఇంకొకసారి ఇలాంటి అవాస్తవమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని చర్యలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు. నిజంగా అన్యాయం జరిగి ఉంటే వారికోసం పోరాటం చేయాలి తప్ప ఎలాంటి అక్రమాలు చేయకున్నా కబ్జాలు చేయకున్నా చేశారని ఆరోపించడం కృష్ణమ్మ మానుకోవాలని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -ఆస్పరి : ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూ నిరంతరం పోరాటాలు సాగిస్తోందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్ప తెలిపారు. గురువారం మండలంలోని అట్టేకల్లు, ముత్తుకూరు, బిల్లేకల్లు, వలగొండ, పుటకలమర్రి, శంకరబండ తదితర పాఠశాలలలో ఎస్టీయు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పలు ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని, సకాలంలో పీఆర్సీని విడుదల చేయాలనీ, ఎపీఎఫ్, ఏపీజి ఎల్ఐసి లోన్స్, ఫైనల్ పేమెంట్, సి.ఎఫ్.ఎం.యస్ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తున్న ఎస్టీయూకు ఉపాధ్యాయులు మద్దతుగా నిలిచి, ప్రతిఒక్కరూ ఎస్టీయూ సభ్యత్వాన్ని పొందాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు, ఎస్టీయూ సీనియర్ నాయకులు లక్ష్మీపతి, రంగవల్లి, కళావతి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి లాంగ్‌జంప్‌లో సత్తాచాటిన విద్యార్థి

విశాలాంధ్ర -కౌతాళం: స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లోని విద్యార్థిని వై.మంజుభార్గవి జిల్లా స్థాయి లాంగ్‌జంప్ అండర్-17 విభాగంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. గురువారం డిస్టిక్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి క్రీడలను ప్రారంభించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములను పక్కనపెట్టి మానసిక శారీరక ఉల్లాసం కోసం క్రీడా పోటీల్లో తప్పక పాల్గొనాలని సూచించారు.క్రీడల ద్వారా విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందుతుందని సూచించారు. అవుట్డోర్ స్టేడియంలో పోటీలను ప్రారంభించారు .

జగనన్న సురక్ష ప్రజలకు వరం

విశాలాంధ్ర-వెల్దుర్తి రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ప్రజలకు ఓ వరమని ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని చెరుకులపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. బీపీ.రక్త పరీక్ష, ఓపీ కౌంటర్లు పరిశీలించి ఎంతమంది ఓపి వచ్చారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించి వంటకాలు తిని చూశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వంశీధర్‌రెడ్డి, శివారెడ్డి వైస్ ఎంపీపీ రాజేశ్వరి, వైద్యులు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈఓఆర్డీ నరసింహులు, రాధిక తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

విశాలాంధ్ర- పెద్దకడబూరు : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గంగులపాడు గ్రామంలో క్లస్టర్ ఇంచార్జీ లీగల్ సెల్ అధ్యక్షులు బాబురావు ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఇంటింటికి తిరుగుతూ అక్రమ కేసులు గురించి ప్రజలకు తెలియజేస్తూ బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలకు మంచి జరగాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. త్వరలోనే చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అర్‌టిఎస్ కన్వీనర్ దశరథరాముడు, అంజి, నాయకులు రాఘవేంద్ర స్వామి, శివ, నరసింహరెడ్డి, హనుమేష్, హంపయ్య తదితరులు పాల్గొన్నారు.

కే మార్కాపురంలో..

విశాలాంధ్ర-కర్నూలుసిటీ: కల్లూరు మండలం కే.మార్కాపురం గ్రామంలో గురువారం కల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డి.రామాంజనేయ ఆధ్వర్యంలో చంద్ర బాబునాయుడుని అక్రమ అరెస్టును ఖండిస్తూ చంద్రబాబుకి మద్దతుగా 'మేము సైతం -బాబు కోసం' ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేసి సాంఘీభావం తెలిపారు.కార్యక్రమంలో నాయకులు పాండు, శేఖర్, లక్ష్మణస్వామి,శేషన్న, సుధాకర్, సర్పంచ్ సుంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం

విశాలాంధ్ర -దేవనకొండ : ప్రజల ముంగిటికే పాలన గొప్పలు చెప్పే ప్రభుత్వంలో పోలీస్ స్టేషన్‌ను దాదాపు 70 కిలోమీటర్లు దూరంలో ఉన్న సర్కిల్ కలపడం ఆంతర్యం ఏమిటని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని మరుమూల గ్రామాలకు ఆలూరు సర్కిల్ దాదాపు 70 కిలోమీటర్ల దూరం అవుతుందన్నారు. ఆలూరు సర్కిల్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.మండలాన్ని డోన్‌నియోజకవర్గంలో ఉన్నప్పుడు కూడా పత్తికొండ సర్కిల్లోనే ఉండేదని అలాంటిది ఇప్పుడు ఇలాంటి నిర్ణయంతో ప్రజలు ఇబ్బందులు పడటం జరుగుతుందని గుర్తించుకొని పత్తికొండ సర్కిల్‌లోనే యధావిధిగా ఉంచాలని టీడీపీ నాయకులు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బండిగింజల రంగన్న, ఉచ్చిరప్ప, రామారావు నాయుడు, సర్పంచులు భాస్కర్, చిన్న రామప్ప, నాగరాజుగౌడ్, రాజశేఖర్ గౌడ్, రాజగోపాల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కోలుకోలేక మాజీ ఎంపీటీసీ మృతి

విశాలాంధ్ర - దేవనకొండ రూరల్: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గిడ్డయ్య(43) గురువారం మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు. మృతుడు గిడ్డయ్య తనకున్న పదెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.రెండేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలతో, తీవ్ర పరిస్థితుల నేపథ్యంలో పంటలు పండక రూ.8 లక్షలు అప్పులు చేశాడు. అప్పులు ఎలా చెల్లించాలో అనే తీవ్ర మనోవేదనతో ఈనెల 9న సాయంత్రం 6 గంటల సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకో లేక మృతి చెందాడు.కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న గిడ్డయ్య మరణంతో కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. మండల జడ్పీటీసీ కిట్టు, వైసీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున మృతుని అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముళ్ల పొదల తొలగింపుకు చర్యలు

విశాలాంధ్ర- కోడుమూరు : పట్టణంలోనీ అన్నిస్మశాన వాటికలలో ముళ్ల పొదల తొలగింపు చర్యలు చేపట్టనున్నట్లు సర్పంచ్ భాగ్యరత్న తెలిపారు. గురువారం ఈఓ అజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని స్మశాన వాటికల్లో తొలగింపు కార్యక్రమానికి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముస్లింమైనారిటి వర్గానికి సంబంధించిన స్మశానం వాటికలో ముళ్లపొదలను తొలగించే ప్రక్రియను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యరత్న మాట్లాడుతూ స్థానిక స్మశాన వాటికల ప్రదేశాల్లో వీలైనంత త్వరలో ముళ్ల పొదల తొలగింపు పనులు పూర్తి చేస్తామన్నారు.కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది వెంకటేష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.